పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

● కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇంటిపన్ను చెల్లింపులో ప్రభుత్వం కల్పించిన రాయితీని వినియోగదారులు ఉపయోగించుకోవాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి కోరారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కొంపల్లి మున్సిపల్ పరిధిలో వసూళ్లు చేసిన పన్నుల వివరాలను కమిషనర్ వివరించారు. రూ.12 కోట్ల 4 లక్షల 86 వేల వసూళ్లు కావలసి ఉండగా, పన్ను చెల్లించని మొండి బకాయి దారులకు 107 రెడ్ నోటీసులు జారీ చేయడంతో 75 శాతం మొండి బకాయిలు చెల్లించారని కమిషనర్ శ్రీహరి తెలిపారు. 2024-25 సంవత్సరం పన్నులు చెల్లించిన వినియోగదారులు 5 శాతం రాయితీని ప్రభుత్వం ఇచ్చిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



మండల అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కాలనీ వాసులు

'అక్రమంగా నీటిని విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

షాపూర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాలనీలోని బోర్ల నుంచి నీటిని అక్రమంగా ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్న వారిని కట్టడి చేయాలని కుత్బుల్లాపూర్ మండల అధికారులకు మహాదేవపురం, రాయల్‌హిల్స్ కాలనీ వాసులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం కాలనీలోని బోర్ల నుంచి నీటిని తోడి రోజుకు 3 వందల ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్నారని, ఇళ్లలో వేసిన బోరుల్లో నీరు రావడం లేదని ఆరోపించారు. రోజు రోజుకు ఎండల తీవ్రత అధికంగా ఉందని, నీటి వాడకం అధికంగా ఉండడంతో బోరుల్లో నీరు రాక ఎండి పోతున్నాయని, అక్రమంగా నీటిని విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు.



శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పీపీనగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో సుమారు 50 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి జగదీశ్వర్‌గౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సురేఖ, భాగ్యలక్ష్మి, సరస్వతి, స్వప్న, మల్లికా, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సంతోష్‌తోపాటు కార్యకర్తలు ఉన్నారు.

నిజాంపేటలో మహిళలు...

నిజాంపేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ 24వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయిన ధనలక్ష్మి, విజయలక్ష్మి మరో 20 మంది మిత్ర బృందంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథ కాలు, అభివృద్ధితో పాటు మహిళలకు ఇస్తున్న పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరి నట్లు మహిళలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, 24వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు మల్లిఖార్జున్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నిజాంపేట్ కార్పొరేషన్ 24వ డివిజన్ మహిళలు



శాంతి కుమారికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: బీఆర్ఎస్

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నీళ్ల లేక పొలాలు సాగక అవస్థలు పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సచివాలయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అన్ని పంటలను రూ.5 వందల బోనస్‌తో కొనుగోలు చేయాలని, పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేల నగదును నష్ట పరిహారంగా అందించాలని డిమాండ్ చేశారు. కలిసిన వారిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు.

రంగారెడ్డిజిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడిగా విజయ్‌భాస్కర్‌రెడ్డి

గచ్చిబౌలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఉపాధ్యక్షుడిగా నల్లగండ్ల గ్రామానికి చెందిన విజయ్‌భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల నర్సింహరెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈనియామక పత్రాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. తనపై నమ్మకంతో డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు విజయ్‌భాస్కర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బాలిక ఆత్మహత్య

మియాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లాకు చెందిన అనిత(17) తన తండ్రి వెంకటేష్‌తో కలిసి మియాపూర్‌లోని గోపాల్ నగర్‌లో ఉంటోంది. ఇంటి పనులు చేసుకుంటూ తన తండ్రితో ఉంటున్న బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి పోలీసులు తరలించారు. అనిత ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. తండ్రి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భవతి కిడ్నీలు ఫెయిల్

సంతోష్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈదీబజార్‌కు చెందిన ఓ గర్భవతి(23) డెలివరీ కోసం స్థానిక కుమ్మరివాడిలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. రక్తం తక్కువగా ఉండటంతో డాక్టర్ సరళ తెల్ల రక్తకణాలు ఎక్కించినట్లు ఆమె భర్త ఇమ్రాన్ తెలిపారు. కొద్దిసేపటి తర్వాత తన భార్య ఆరోగ్యం క్షీణించిందని, మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి డయాలసిస్ చేయించాలని వైద్యులు తెలిపారని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని ఆరోపిస్తూ ఇమ్రాన్ సంతోష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం

పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ఓల్డుబోయినపల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిదని అన్నారు. అన్ని మతాల ప్రజలను ఆదరించిన పార్టీగా బీఆర్ఎస్ గుర్తింపు తెచ్చుకున్నదని అన్నారు. వచ్చే నెలలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ పార్టీలో పదవులను ఆశించే నాయకులు వస్తుంటారు వెళుతుంటారు కానీ కార్యకర్తలు మాత్రం ఎల్లప్పుడు పార్టీని అంటి పెట్టుకుని సైనికుల్లా పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారని అన్నారు.

కార్యకర్తలను నమ్ముకున్నందుకే తాను ఈ స్థాయిలో ఉన్నానని, గత ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించింది కార్యకర్తలేనని ఆయన గుర్తు చేశారు. తనను గెలిపించిన విధంగానే బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరేందర్‌గౌడ్, నర్సింహ, జంగయ్య, కర్రెలావణ్య, మక్కల నర్సింగ్‌రావు, ఎజాజ్, బల్వంత్‌రెడ్డి, వాసు, ఖదీర్, ఇర్ఫాన్, హరినాథ్ పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావుతో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

'ఓటరు నమోదు' పై ర్యాలీ

గచ్చిబౌలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు కొండాపూర్‌లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో కలిసి ఆయా కాలనీల్లో, కొత్తగూడ గ్రామం పోలీస్ బెటాలియన్‌లో ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈ నెల 15వ తేదీ వరకు అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఉప కమిషనర్ రజనికాంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఓటరు నమోదుగా చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్కిల్ రెవెన్యూ, శానిటేషన్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమౌతున్నారు. అందుకోసం ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది సుమారు 500 మందికి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సర్కిల్ పరిధిలోని శ్రీవెంకటేశ్వర కళాశాలలో సిబ్బందికి మొదటి విడత తరగతులు ప్రారంభమయ్యాయని డీసీ రజనికాంత్‌రెడ్డి తెలిపారు. త్వరలో రెండో విడత శిక్షణ తరగతులు ప్రారంభమౌతాయన్నారు. పోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే లేఖలు పంపడం జరిగిందని, సిబ్బంది తప్పకుండా శిక్షణకు హాజరు కావాలన్నారు. హాజరు కాని వారిపై శాఖపరంగా చర్యలు ఉంటాయని ఆయన అన్నారు.



సఫ్దర్ నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

అల్లాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ నిర్ణయాలకు కట్టుబడి కార్యకర్తలంతా కలిసికట్టుగా పార్లమెంటు అభ్యర్థి పట్నం సునీత విజయానికి కృషి చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన అల్లాపూర్ డివిజన్ సఫ్దర్ నగర్‌లో డివిజన్ మాజీ అధ్యక్షుడు షఫీఉద్దీన్ ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని, సమష్టి కృషితో విజయం తమ సొంతమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన ఇఫ్తార్ విందులో బండి రమేష్ పాల్గొనగా నాయకులు శేరి సతీష్, మోయినుద్దీన్, విఠల్, రేష్మ, బర్కత్ అలీ, నయీమ్ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో రూ.256 కోట్ల ఆస్తిపన్ను వసూలు

గచ్చిబౌలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూళ్లలో 90 శాతం వసూల్ చేశారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు రూ. 284 కోట్ల టార్గెట్‌ను ఇవ్వగా అందులో రూ.256 కోట్లు వసూళ్లు చేశారు. లక్ష్యానికి చేరువులో ఉన్నారు. ఆస్తిపన్ను వసూళ్లలో మొండిబకాయిలు కూడా వసూలు చేశామని గతంకంటే ఎక్కువ వసూల్లు చేశామని అధికారులు తెలిపారు. ఓ వైపు ఎన్నికల హడావిడి ఉండటంతో అధికారులు కొంత ఒత్తిడికి గురయ్యారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది పాల్గొనడంతో ఆ ప్రభావం వసూళ్లపై పడినట్లు చెబుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.220 కోట్లు చేయ్యగా, ఈ ఏడాది రూ.256 కోట్లు వసూళ్లు చేశామని డీసీ పేర్కొన్నారు.

ఒక్కరోజే రూ.5 కోట్లు వసూళ్లు

2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజే రూ.5 కోట్లు వసూళ్లు చేశామని ఉప కమిషనర్ రజనికాంత్‌రెడ్డి తెలిపారు. ముందుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ప్రకటించారు. ఈ పథకానికి ఎర్లీబర్డ్ అని నాకరణం చేశారు. ఈ పథకానికి స్పందించిన ఆస్తిపన్ను చెల్లింపు దారులు మంగళవారం ఒక్కరోజే రూ.5 కోట్లు వచ్చాయన్నారు. ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి 30 వరకే ఉంటుందని ఆస్తిపన్ను చెల్లింపు దారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాయితీ పొందవచ్చాన్నారు.

చందానగర్ సర్కిల్‌లో...

చందానగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్ పరిధిలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి రూ.100.84 కోట్ల ఆస్తి పన్ను వసూళ్లు చేసినట్లు ఉప కమిషనర్ వంశీ కృష్ణ తెలిపారు. సర్కిల్ పరిధిలోని మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్ల పరిధిలోని ఆస్తిపన్ను వసూల్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది రూ.113 కోట్ల ఆస్తిపన్ను వసూళ్లకు టార్గెట్ ఇవ్వగా రూ.100.84 కోట్లు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 89.96శాతం వసూళ్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ సంస్థల నుంచి కూడా ఆస్తిపన్ను వసూళ్లు చేసినట్లు పేర్కొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి



సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పించిన గౌడ సంఘం నాయకులు శివకుమార్‌గౌడ్, తదితరులు

హైదర్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తన కార్యాలయంలో మంగళవారం పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, రాములు గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాజ్యలక్ష్మి, పుట్టం దేవి, స్వప్న, నిర్మలమ్మ, బి.లక్ష్మి, సరిత, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మొగల్ పాలకుల పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడి దళిత బహుజనులను ఏకం చేసి పోరాటం చేసిన విప్లవ వీరుడు సర్దార్ పాపన్నగౌడ్ అని గౌడ సంఘం నాయకులు అన్నారు. పాపన్న 315వ వర్ధంతి సందర్భంగా బాలానగర్ కమాన్ వద్ద ఉన్న పాపన్న విగ్రహానికి నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాలానగర్ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పుష్పారెడ్డి, నాయకులు సదాగౌడ్, యాదగిరిగౌడ్, పులిశ్రీకాంత్‌గౌడ్, దండురవి గౌడ్, రాముగౌడ్ పాల్గొన్నారు.

మియాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని మియాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో మియాపూర్ ఆల్విన్‌కాలనీ చౌరస్తా ప్రధాన రహదారి పక్కన ఉన్న సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి సంఘం నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న కేటీఆర్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే సీఏఏకు వ్యతిరేకం: బీఆర్ఎస్

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే సీఏఏకు బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకమని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం సాయంత్రం జీకే కాలనీలోని సరస్వతి ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ముస్లింలకు అండగా ఉంటుందన్నారు. పదేళ్ల ప్రభుత్వానికి అండగా ముస్లింలు నిలిచారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లింల సహకారంతో గ్రేటర్ హైదరాబాద్‌లో మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. బీఆర్ఎస్ పార్టీ లౌకిక రాజ్యానికి అనుగుణంగా నడుచుకొంటుందన్నారు. ముస్లిం సోదరులకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహ్మద్‌అలీ, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు మీనాఉపేందర్ రెడ్డి, సునీతాయాదవ్, సబితాఅనిల్‌కిషోర్, మాజీ ఎంటీసీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉపేందర్ రెడ్డి, జీకే హనుమంతరావు, అంజయ్య, రాముయాదవ్, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో ఏఆర్ కానిస్టేబుల్ వసూళ్లు

● ప్రభుత్వ ఉద్యోగులకు బెదిరింపులు

● అతడితో పాటు సహకరించిన మెకానిక్ అరెస్ట్

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ ఇన్‌స్పెక్టర్ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్‌ను, అతనికి సహకరిస్తున్న ఓ టీవీ మెకానిక్‌ను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, చైతన్యపురి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్మన్‌ఘాట్, క్రాంతినగర్‌లో నివసించే ఎ.మల్లేశ్ అలియాస్ మూర్తి (38) మహబూబ్‌నగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించేవాడు. కొద్దికాలం క్రితం నాగర్‌కర్నూల్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. తనకు పరిచయస్తుడైన చింతలకుంటకు చెందిన టీవీ మెకానిక్ రాపోలు అనిల్‌కుమార్ అలియాస్ అనిల్ (28)తో కలిసి సులువుగా డబ్బు సంపాదించడం కోసం ఏసీబీ ఇన్‌స్పెక్టర్ అవతారమెత్తాడు. ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేసే ఉద్యోగుల వివరాలతో ఒక లిస్ట్ తయారు చేశాడు. వారిని టార్గెట్ చేసి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించాడు. అనిల్ ఫోన్ ద్వారా వారిని బెదిరించేవాడు. పే అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో ట్రెజరర్‌గా విధులు నిర్వరిస్తున్న కొత్తపేటకు చెందిన కె.సుధీర్‌బాబుకు మార్చి 6న ఫోన్ చేశాడు. అవినీతికి పాల్పడుతున్నావంటూ ఏసీబీకి ఫిర్యాదులు వచ్చాయని బెదిరించాడు. దాడి చేయకుండా ఉండాలంటే లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీని గురించి మాట్లాడేందుకు బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఏసీబీ కార్యాలయం రోడ్డు వద్దకు రావాలని సూచించాడు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి

పోలీసులను ఆశ్రయించడంతో ఆటకట్టు..!

తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, తనను బెదిరిస్తున్న మల్లేష్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సుధీర్‌బాబు చైతన్యపురి పోలీసులను ఆశ్రయించాడు. కాల్‌డేటా ఆధారంగా అనిల్, మల్లేష్‌పై చైతన్యపురి పోలీసులు, ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు నిఘా పెట్టారు. అనిల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఏఆర్ కానిస్టేబుల్ మల్లేష్ సూత్రధారిగా తేలింది. దీంతో పోలీసులు మంగళవారం కానిస్టేబుల్ మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఎనిమిది మంది వద్ద డబ్బు వసూలు..

నిందితులు మల్లేష్, అనిల్‌ను విచారించగా గతంలో ఎనిమిదిమంది ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి సుమారు రూ.3.40 లక్షల రూపాయలు వసూలు చేసినట్లు తేలింది. వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ అంజిలప్ప నుంచి రూ.లక్ష, డీఎస్పీ ఇమ్మానుయల్ నుంచి రూ.8 వేలు, ఆర్ఐ వీరేష్ నుంచి రూ.65 వేలు, ఆర్టీసీ కండక్టర్ చంద్రయ్య నుంచి రూ.5 వేలు, అనిల్, రామ్‌లాల్, సౌమిత్రి నుంచి రూ.5 వేలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. నిందితుల వద్ద రెండు మొబైళ్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ ఇన్‌చార్జిలు బండిరమేష్, కొలను హన్మంత్‌రెడ్డి, తదితరులు

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు

బాలానగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండిరమేష్, కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలను హన్మంత్‌రెడ్డి, తదితర కాంగ్రెస్ నేతలు గచ్చిబౌలిలోని నరేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపై చేపట్టాల్సిన ప్రచార వ్యవహారంపై చర్చించి నరేందర్‌రెడ్డి సలహాలను తీసుకున్నారు.



ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేస్తున్న కెఎం ప్రతాప్‌గౌడ్

ఇఫ్తార్ విందులు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

● కేఎం ప్రతాప్‌గౌడ్

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కేఎం ప్రతాప్‌గౌడ్ అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్‌లోని గాంధీనగర్‌లో జామమసీద్ మహ్మదీయ మసీద్ కమిటీ సదర్ ఆధ్వర్యంలో స్పైటన్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ప్రతాప్‌గౌడ్, యువనేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్ హాజరై ముస్లిం సోదరులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జామమసీద్ మహ్మదీయ మసీద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్‌ఖాజా, మహ్మద్ సీరాజుద్దీన్, అమీద్, బాషా, షేక్ బాబూమియా, గౌస్, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ డీ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ ఉమ

ఫిజిక్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ శ్రీకాంత్‌కు బాధ్యతలు



డాక్టర్ ఉమ, ప్రొఫెసర్ శ్రీకాంత్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో ఆర్ అండ్ డీ డైరెక్టర్‌గా బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. అద్దేపల్లి ఉమకు, ఫిజిక్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ తిరుమల శ్రీకాంత్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు ఇటీవల పదవీ విరమణ చేసిన నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు ఈ నియామకాలను చేపట్టారు. ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ ఉమ ప్రస్తుతం అదే విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా, ఫిజిక్స్ విభాగాధిపతిగా అదనపు బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ శ్రీకాంత్ పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్‌గా వ్యవహరిస్తున్నారు. అర్హత కలిగిన సీనియర్ ఆచార్యులు ఎంతోమంది అందుబాట్లో ఉన్నప్పటికీ కీలకమైన విభాగాలకు ఇన్‌చార్జీలుగా ఉన్నతాధికారులు నియమించడాన్ని యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది ఆక్షేపిస్తున్నారు. యూనివర్సిటీలో ఖాళీగాఉన్న అన్ని పోస్టుల్లో పూర్తిస్థాయి అధికారులను వీలైనంత త్వరగా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తాం

● జగదీశ్వర్ గౌడ్

గచ్చిబౌలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి నూతన ఉత్తేజం నింపడంతో పాటు పూర్వవైభవం తీసుకువస్తామని పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, చందానగర్ డివిజన్లకు నూతన కమిటీలను నియమించారు. ఈ మేరకు కమిటీ నియామక ఉత్తర్వులను కమిటీలకు అందజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఏడు డివిజన్లకు కొత్తగా కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీలు పార్లమెంట్ ఎన్నికల వరకు ఉత్సాహంగా పనిచేసి పార్టీని గెలుపు తీరాలకు చేర్చాలన్నారు. ప్రతి డివిజన్‌లో 50 మందితో కమిటీ వేయడం జరిగిందని వారందరికి నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. పనిచేసే ప్రతికార్యకర్తకు పార్టీ గుర్తింపు ఇస్తుందని మండల కమిటీతో పాటు కాంగ్రెస్ అనుబంధ సంఘాల నియామకం త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ రాములుగౌడ్, మాజీ కౌన్సిలర్ నర్సింగ్‌రావు, నల్ల సంజీవరావు, బాలింగ్ యాదగిరిగౌడ్, డివిజన్ అధ్యక్షుడు మహిపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'అయ్యో'మయం!

(5వ పేజీ తరువాయి)

నగరంలో బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపింది. పార్టీ మారుతారంటూ నగరానికి చెందిన పలువురు గులాబీ శాసనసభ్యుల పేర్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మేం బీఆర్ఎస్‌ను వీడేది లేదని ఎమ్మెల్యేలు చెబుతున్నా.. ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న అనుమానం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన పూర్వాశ్రమం కాంగ్రెస్‌లో తిరిగి చేరుతారని ప్రచారం జరుగతున్న వేళ.. నియోజకవర్గ హస్తం నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేటలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర నిర్వహించడం గమనార్హం.

ఈ సమయంలో పార్టీ మారుతారని ప్రచారం జరగడంతో దీంతో పార్టీలో ఉంటారా? వెళ్తారా? అని ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేయాల్సిన వేళ ఇలాంటి పరిస్థితి ప్రభావం చూపుతుందని సీనియర్ నేతలు అభిప్రాయ పడుతున్నారు.

మియాపూర్ మెట్రోడిపోలో అగ్నిప్రమాదం

మియాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ మెట్రోడిపోలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని మెట్రోడిపో నుంచి ఒక్కసారిగా పొగ మంటలు రావడంతో అందరూ తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మెట్రోడిపోలోని చెత్తకు మంటలు అంటుకోవడంతో పొగ, మంటలు ఎగసిపడ్డాయి. దీంతో వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఎటువంటి ప్రమాదం జరగక లేదు. చెత్తకు ఎవరు నిప్పుఅంటించారనేది మాత్రం తెలియరాలేదు.